క్లుప్తంగా

ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడిగా నాగబాబు

మలికిపురం: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కమిటీలో సభ్యుడిగా చింతలమోరి గ్రామానికి చెందిన దొడ్డా నాగబాబు నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రం అందినట్లు నాగబాబు గురువారం తెలిపారు. ఆయన్ని బీజేపీ నాయకులు అడబాల సత్యానారాయణ, మాలే శ్రీనివాస్‌నగేష్, కాపిశెట్టి కనకేశ్వరరావు, ఇందుకూరి అచ్యుత రామరాజు తదితరులు అభినందించారు.

వైఎస్సార్ సీపీ గ్రామ బీసీ సెల్ అధ్యక్షుడి మృతి

మలికిపురం: శంకరగుప్తం గ్రామ వైఎస్సార్ సీపీ బీసీసెల్ అధ్యక్షుడు మందపాటి శ్రీను మృతి చెందారు. ఆయన మృతికి గ్రామ కూడలిలో పార్టీ నాయకులు సంతాప సభ ఏర్పాటు చేశారు. శ్రీను మృతి పార్టీకి తీరని లోటని సొసైటీ మాజీ అధ్యక్షుడు సాగిరెడ్డి వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఓగూరి హనుమంతరావు, అడబాల బుజ్జి, రాపాక లక్ష్మణ్, కొంబత్తుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రాలను సంరక్షించుకుందాం..

అంబాజీపేట: నేత్రాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. పి.గన్నవరం ప్రభుత్వ కంటి వైద్యాధికారి ప్రభాకరరావు, ఎంఎల్‌హెచ్‌పీ మౌనికలు వైద్య సేవలు అందించారు.

రైతుల సంక్షేమానికి కృషి

అంబాజీపేట: పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని పశు వైద్యాధికారులు డి.రాజేంద్ర, శ్రీనివాస్ అన్నారు. నందంపూడిలో జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా గురువారం మహిళా రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించవచ్చన్నారు. రైతులు పితాని వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


బుద్ధరాజు సీతమ్మ (ఫైల్)

ఆత్రేయపురం: మండల పరిధిలోని లొల్ల గ్రామంలో బుద్ధరాజు సీతమ్మ (102) గురువారం మృతి చెందింది. ఈమెకు కుమారుడు, ఐదుగురు మనవరాళ్లు, 13 మంది ముని మనుమలు ఉన్నారు. ఈమె మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పశు బీమా వరం

పి.గన్నవరం: పాడి రైతులకు డాక్టర్ వైఎస్సార్ పశు బీమా పథకం వరం లాంటిదని ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకుడు ఎల్.విజయారెడ్డి అన్నారు. నాగుల్లంకలో సర్పంచ్ యల్లమెల్లి కృష్ణవేణి అధ్యక్షతన గురువారం పశు బీమా పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాడి పశువులు, గొర్రెలు, మేకలు, పందులు మరణిస్తే సంబంధిత యజమానులను ఆదుకునేందుకు ఈ బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. తెలుపు రంగు రేషన్ కార్డు కలిగిన రైతులు పాడి పశువులకు రూ.30 వేల బీమా కోసం మూడేళ్లకుగాను రూ.384లు, రూ.15 వేల బీమాకు రూ.192 ప్రీమియంగా చెల్లించాలని తెలిపారు. మిగతా వారు కూడా బీమా చేయించుకోవచ్చన్నారు. మానేపల్లి పశు వైద్యాధికారి పి.కిరణ్ చైతన్య పాల్గొన్నారు. ఊడిమూడిలో వైఎస్సార్ పశుబీమా పథకాన్ని విజయారెడ్డి ప్రారంభించారు. పశు వైద్య సహాయకులు ప్రశాంతి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓ వెంకటరత్నం బదిలీ

అలమూరు: పెదపళ్ల పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌ఓ)గా పనిచేస్తున్న పి.వెంకటరత్నం బదిలీ అయ్యారు. సీతానగరం పీహెచ్‌సీకి బదిలీ కావడంతో ఆ మేరకు గురువారం రిలీవ్ అయ్యారు.

జగనన్న కాలనీ పరిశీలన

ఆలమూరు: పినపళ్లలో వైఎస్సార్ జగనన్న కాలనీని తహసీల్దార్ ఏపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పరిశీలించారు. ఇప్పటికే స్థలాన్ని మెరక చేయడంతో లబ్ధిదారులకు స్థలాలు అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తామని వారు తెలిపారు. ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, కార్యదర్శి ఎస్.వీ.రాజు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

అయినవిల్లి: మండలంలో ముమ్మరంగా ఉపాధి పనులు జరుగుతున్నాయని ఏపీఓ నాగబాబు తెలిపారు. గురువారం పలు గ్రామాల్లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పంట బొదెల అభివృద్ధి, కాలువల్లో పూడికతీత పనులు, కొబ్బరి చెట్లకు పళ్లాలు వేయడం, పుంత రోడ్ల అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం

మామిడికుదురు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత అన్నారు. గురువారం పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయం సమీపంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పలువురు రోగులకు ఆమె వైద్య పరీక్షలు చేశారు. వారికి వైద్య సలహాలు, సూచనలు అందించి మందులు ఇచ్చారు. దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి వైద్య సహాయం అందించారు. హెచ్‌వీ కె.నిర్మల, ఏఎన్‌ఎం పి.నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ పి.నాగదుర్గ, హెల్త్ అసిస్టెంట్ సుందరనీడి సూరిబాబు పాల్గొన్నారు.

ఎంతైనా కష్టపడతా.. అభివృద్ధి చేస్తా..

- ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి
- రూ.కోటితో పలు పనులకు శంకుస్థాపన


గంటి పల్లిపాలెంలో రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గ అభివృద్ధి విషయంలో పట్టు వదలకుండా ఎంతైనా కష్టపడతానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. కొత్తపేట, రావులపాలెం మండలాల పరిధిలోని గంటి- పల్లిపాలెం, గోపాలపురం- పల్లిపాలెం గ్రామాలకు సంబంధించిన ఉమ్మడి ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆధునీకరణకు రూ.90 లక్షలు మంజూరు కాగా గురువారం సాయంత్రం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004-05లో తాను మొట్టమొదటి సారి ఎమ్మెల్యేగా ఈ రోడ్డు వేశానని, తిరిగి 20 ఏళ్లకు మళ్లీ మోక్షం కలిగిందన్నారు. గతేడాది పలివెల- పల్లిపాలెం రోడ్డుకు రూ.1.40 కోట్లు మంజూరు కాగా, ఆ నిధులు సరిపోక దానిలో 1.01 కిలోమీటరు మేర ఈ రోడ్డు మిగిలిపోయిందన్నారు. దీనికి తిరిగి రూ.90 లక్షలు మంజూరు చేయించానన్నారు. ఈ విషయంలో ఎంతో కష్టపడ్డానని వివరించారు. 650 మీటర్ల సీసీ రోడ్డు, మిగిలింది బీటీ రోడ్డుగా నిర్మిస్తారన్నారు. గంటి- గోపాలపురం కెనాల్ రోడ్డును పీఆర్ నుంచి ఆర్‌అండ్‌బీకి బదలాయిస్తూ జీఓ తీసుకొచ్చామని, రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నామని జగ్గిరెడ్డి వివరించారు. అనంతరం కొత్తపేట మార్కెట్ వీధి మసీదు ఆవరణలో రూ.10 లక్షలతో నిర్మించే భవనానికి జగ్గిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ముస్లింలకు ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు చేయించామన్నారు. గౌతమీనగర్‌లో రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు.

పార్టీని నమ్ముకున్న వారికి గుర్తింపు

వైఎస్సార్ సీపీని నమ్ముకుని అభివృద్ధికి కష్టపడిన కార్యకర్తలకు తగిన గుర్తింపునిచ్చి దశల వారీగా పదవులు కల్పిస్తామని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి అన్నారు. రాకుర్తివారిపాలెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ పర్సన్ ఇన్‌చార్జిగా గోగి సురేష్, పర్సన్లుగా చోడపనీడి చిన్న, నందం సత్తిబాబు నియమితులు కాగా సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కమిటీని సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, సర్పంచులు సాగి బంగార్రాజు, సబ్బితి మోహన్‌రావు, కుడుపూడి రామలక్ష్మి, రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు ముల్ల జనార్దన్, చావలి సుబ్బరాయశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ


మృతుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: ఇటీవల నిడదవోలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను గురువారం కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు శివారు యాజీపాలేనికి చెందిన మిద్దే సత్తిబాబు, తేజ, దాసరి శ్రావణి, మిద్దే అరుణ మృతి చెందగా ఆయా కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చారు. అనంతరం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు కునాధరాజు శ్రీనివాసరాజు, సర్పంచ్ వేముల శ్రీనివాస్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేముల రామన్న, స్కూల్ చైర్మన్ మిద్దే వెంకన్న, మిద్దే శ్రీను తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధితో భరోసా


అంబాజీపేటలో లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అంబాజీపేట: నిరుపేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ పది గ్రామాలకు చెందిన 20 మంది లబ్ధిదారులకు రూ.13.20 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశామన్నారు. గంగలకుర్రు అగ్రహారం లబ్దిదారులకు రూ.4 లక్షలు, ఇరుసుమండ రూ.2.85 లక్షలు, పసుపల్లి రూ.2.42 లక్షలు, మాచవరం రూ.1.55 లక్షలు, పుల్లేటికుర్రు రూ.1.12 లక్షలు, కె.పెదపూడి రూ.45 వేలు, ముక్కామల రూ.22 వేలు, గంగలకుర్రు రూ.22 వేలు, నందంపూడి రూ.22 వేలు, తొండవరం లబ్ధిదారుకు రూ.15 వేల చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, రావు, సొసైటీ అధ్యక్షులు నందుల ఆదినారాయణ, నాగాబత్తుల సత్యానందరావు పాల్గొన్నారు.

కొబ్బరి కొనుగోలుకు సహకరిస్తాం

కొబ్బరి రైతులను ఆదుకునేందుకు త్వరలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలుకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొబ్బరి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇంతవరకూ ఏపీ ఆయిల్‌ఫెడ్ ద్వారా కొబ్బరిని కొనుగోలు చేసేవారని, ఆ శాఖలో సిబ్బంది లేక కొనుగోలును ప్రభుత్వం ఏపీ మార్క్‌ఫెడ్‌కు బదలాయించిందన్నారు. త్వరలో మార్కెట్ యార్డులో కొబ్బరిని కొనుగోలు చేస్తామని, ఇందుకు తగిన సౌకర్యాలు కల్పించాలని కార్యదర్శి యాళ్ల సత్యభాస్కరరావును ఎమ్మెల్యే ఆదేశించారు. రానున్న వరదలను దృష్ట్యా రైతుల ఉత్పత్తులు దాచుకునేందుకు గొడౌన్‌ను నిర్మించాలని వీరవల్లిపాలేనికి చెందిన పాలకవర్గ సభ్యుడు అడపా బాలబాలాజీ ఎమ్మెల్యేను కోరారు. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, కోట విజయరాజు, కడలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం


కత్తిమండలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: గ్రామాల్లో రోడ్ల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. కత్తిమండ గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో రోడ్ల అభివృద్ధికి ఆయన గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఏ అవసరం వచ్చినా ముందుండి పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే ప్రజలను ఓట్లు అడిగే హక్కు ఉందన్నారు. ఎన్నికలు వస్తుండడంతో ప్రతిపక్షాలు లేనిపోని రాద్ధాంతం చేసి ప్రజలకు మోసం చేసేందుకు వస్తున్నాయన్నారు. అటువంటి పార్టీలకు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని వాటినీ అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ఆశీర్వదించాలని అన్నారు. ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, ఎంపీటీసీ సభ్యులు చిట్టాల శ్రీనివాస్, గుబ్బల గౌరీ వెంకటపద్మావతి, సర్పంచ్ ఆరేటి రంగనాయకులు, సొసైటీ చైర్మన్ పెమ్మాడి సోమరాజు, అల్లూరు సూరిబాబు, కర్రి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత భూరక్ష పథకంపై సమీక్ష


మామిడికుదురులో సమీక్షిస్తున్న ఆర్డీఓ వసంతరాయుడు

మామిడికుదురు: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంపై అమలాపురం ఆర్డీఓ వసంతరాయుడు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రియాజ్ హుస్సేన్‌తో పాటు రెవెన్యూ అధికారులతో చర్చించారు. గెద్దాడ, కొమరాడ, మాకనపాలెం గ్రామాల్లో సుమారు 1400 ఎకరాల భూమి ఉందని, అక్కడ రీసర్వే పూర్తయ్యిందని తహసీల్దార్ చెప్పారు. పైగ్రామాలకు సంబంధించి రైతుల నుంచి సవరణల కోసం ఏమైనా దరఖాస్తులు వస్తే వాటిని రెండ్రోజుల్లో పరిష్కరించాలని ఆర్డీఓ వసంతరాయుడు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ శరణ్య పాల్గొన్నారు.

రాజోలు: రీసర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డీఓ వసంతరాయుడు సూచించారు. తాటిపాకలో రీసర్వే పనులను పరిశీలించారు. మండలంలోని ఏడు గ్రామాల్లో రీసర్వే పనులు జరుగుతున్నాయని తహసీల్దార్ బి.ఎం.ముక్తేశ్వరరావు వివరించారు.

ప్రతి ఇంటా సంక్షేమ వసంతం


జి.అగ్రహారంలో పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ వసంతం వచ్చిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల పంపిణీ తీరును ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. గృహ రుణాలు, పింఛన్లు ఇప్పించాలని, రహదారులను అభివృద్ధి చేయాలని కాలనీవాసులు ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ అర్హులందరికీ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని అన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పాలన ప్రజలకు చేరువైందన్నారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, ఎంపీటీసీ విత్తనాల దుర్గాభవాని, సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, రాయుడు కృష్ణమహేష్, ఎంఎం శెట్టి, పులిదిండి ఏడుకొండలు, విత్తనాల శేఖర్, రాయుడు షణ్ముఖ్, ముత్తాబత్తుల ప్రశాంత్ పాల్గొన్నారు.

సింగర్స్ క్లబ్ ప్రారంభం



రామేశ్వరంలో బ్రోచర్ విడుదల చేస్తున్న డాక్టర్ ప్రతాప్

సఖినేటిపల్లి: రామేశ్వరంలో గురువారం సంగీత దర్శకుడు సింధు కె.ప్రసాద్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన సింగర్స్ క్లబ్, రైటర్స్ క్లబ్‌ను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ప్రారంభించారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు. ప్రతాప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న కళాకారులకు ఈ క్లబ్ తగిన తోడ్పాటు ఇస్తుందన్నారు. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన రికార్డింగ్ స్టూడియో, క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. కాగా విశాఖపట్నం, హైదరాబాద్ ప్రధాన కేంద్రాలుగా ఇక్కడ రికార్డింగ్ స్టూడియో పనిచేస్తుందని సింధు తెలిపారు. క్లబ్ ద్వారా నూతన గాయకులకు అవకాశం కల్పిస్తామన్నారు. ప్రముఖ సింగర్ డాక్టర్ కె.జాషువా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ రక్షిత జలాలు

రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు


అప్పనరామునిలంకలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

సఖినేటిపల్లి: భవిష్యత్తులో ప్రతి ఇంటికీ రక్షిత జలాలు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం అప్పనరామునిలంకలో అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలసి ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందిన పథకాలపై బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తున్న సీఎం జగన్‌ను వచ్చే ఎన్నికల్లో తిరిగి ఆశీర్వదించాలని ఆయన కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరాకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇప్పటికే మండలంలోని తీర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు జేజేఎంలో అంతర్వేదిలో భారీ బృహత్తర తాగునీటి ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంటోందన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు బర్రే రాము, పీఏసీఎస్ అధ్యక్షుడు దివ్వి చిట్టిబాబు, నాయకులు కేఎస్ఎన్ రాజు, చొప్పల రాజబాబు పాల్గొన్నారు.

కిక్కిరిసిన అయినవిల్లి ఆలయం


ఆలయంలో చిన్నారికి పటికీబెల్లం తులాభారం ఇస్తున్న భక్తులు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం గురువారం భక్తులతో కిక్కిరిసింది. ఉదయమే స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నప్రాసనలు, పటికీబెల్లం తులాభారాలు జరిగాయి. ఆలయానికి ఈ ఒక్కరోజే రూ.92,801 ఆదాయం సమకూరిందని ఈఓ మదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


కొత్తపేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ సత్యనారాయణ

కొత్తపేట: విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్‌ఎఫ్) చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో చైర్‌పర్సన్ సత్యనారాయణ, సభ్యుడు డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్ విద్యుత్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. స్థానిక కోర్టు, శతాబ్ది డిగ్రీ కళాశాలలో న్యాయవాదులు, వినియోగదారులు, విద్యార్థులకు సీజీఆర్‌ఎఫ్ న్యాయస్థానం, విద్యుత్ సమస్యల పరిష్కారం గురించి అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 ద్వారా విద్యుత్ సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. జేఈ టీవీవీఎస్ఎస్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు లబ్ధి


కొత్తపేటలో జగనన్న సురక్షపై అవగాహన కల్పిస్తున్న అముడ చైర్మన్ డేవిడ్‌రాజు

కొత్తపేట: అర్హులంతా ప్రభుత్వ పథకాలను పొందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడ) చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ సారథ్యంలో రాష్ట్రంలో 87 శాతం మంది పథకాల ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. అర్హులందరికీ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 23 నుంచి వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి ప్రజావసరాలను గుర్తించాలన్నారు. వాటిని వచ్చే నెల 1 నుంచి సచివాలయాల వద్ద అధికారుల బృందాలు నిర్వహించే ప్రత్యేక క్యాంప్‌లలో పరిశీలించి పరిష్కరిస్తారన్నారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, వానపల్లి పళ్లాలమ్మ దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్డీకి సన్మానం

కొత్తపేట ఈఓపీఆర్డీగా పనిచేసి ముమ్మిడివరానికి బదిలీ అయిన సీహెచ్ లక్ష్మీకళ్యాణికి వీడ్కోలు సన్మానం గురువారం జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ సుంకర రెడ్డినాయుడు ఆధ్వర్యంలో ఎంపీడీఓ మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఆమెను సత్కరించారు. గ్రామ కార్యదర్శులు కార్యదర్శులు రెడ్డినాయుడు, వీవీ రామన్, మంగిపూడి రాంబాబు, పి.సత్తిబాబు, ఎస్.రాజరాజేశ్వరి, డి.వరలక్ష్మి, కేఎస్ఎన్ మూర్తి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, మండల పరిషత్ ఏఓ కృష్ణారెడ్డి, ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ పాల్గొన్నారు.

సకల వసతులతో సర్కారు బడులు


పలివెలలో ఉత్తమ విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు కల్పించి పేదల విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. గురువారం పలివెల, గంటి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పురస్కారాలు అందించారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో పోటీతత్వం, తద్వారా వారిలో ప్రతిభను ప్రోత్సహించేందుకు 'జగనన్న ఆణిముత్యాలు' పేరుతో వినూత్న కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. ఆయా పాఠశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన గున్నూరి వెంకటమోహన్, చల్లాబత్తుల సాయిదీప్తి, మల్లవరపు సునీత, డి.మోహిత సత్యదుర్గ, గుత్తుల శ్రీదుర్గ, వాడపల్లి జ్యోతిలను సత్కరించి, నగదు బహుమతులు అందించారు. సర్పంచ్ సాగి బంగార్రాజు, ఎంపీటీసీ సభ్యులు గునిపే శ్యామల, ముళ్ల జనార్దనరావు, హెచ్‌ఎంలు పి.ఇందిరాబాయి, అక్కిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నీటి తీరువా వసూళ్లు వేగవంతం

అయినవిల్లి: రైతుల నుంచి నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలని వీఆర్వోలను తహసీల్దార్ నాగలక్ష్మమ్మ ఆదేశించారు. నేదునూరు తదితర గ్రామాల్లో పర్యటించారు. గురువారం రూ.1.40 లక్షలు నీటి తీరువా వసూలు చేశామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయినవిల్లి: విద్యుత్తు నిర్వహణ పనుల నిమిత్తం మండలంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

ఆత్రేయపురం: విద్యతో పాటు క్రమశిక్షణను విద్యార్థులు అలవర్చుకోవాలని ఎన్ఆర్ఐ, ఆస్ట్రేలియాలో ఓఏఎమ్ అవార్డు గ్రహీత డాక్టర్ కృష్ణ నడింపల్లి సూచించారు. ఆత్రేయపురం మహర్షి విద్యానికేతన్ హైస్కూల్ ప్రాంగణంలో కరస్పాండెంట్ ఎస్‌వీ రామరాజు అధ్యక్షతన విద్యార్థులకు విద్య, ఉద్యోగ అవకాశాలపై సదస్సు జరిగింది. డాక్టర్ కృష్ణ నడింపల్లి మాట్లాడుతూ తాను తయారు చేసిన ప్రకృతి వైపరీత్యాల నష్ట నివారణ వ్యవస్థను ఆస్ట్రేలియాతో పాటు కొన్ని దేశాలు అమలు చేస్తున్నాయన్నారు. పికానా స్వీట్స్ నిర్వాహకుడు గాదిరాజు ప్రసాదరాజు, హెచ్‌ఎం మంతెన ఆనందరాజు మాట్లాడారు.

నవోదయకు ఎంపిక

ఆత్రేయపురం: పేరవరం మెయిన్ స్కూల్ విద్యార్థిని యార్లగడ్డ సుష్మ 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి నవోదయలో ఆరో తరగతిలో ప్రవేశానికి సీటు సాధించినట్లు ఎంఈఓ వరప్రసాద్ తెలిపారు. సుష్మను పలువురు అభినందించారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

సఖినేటిపల్లి: అంతర్వేదికర జెడ్పీ హైస్కూల్‌లో గురువారం హెచ్‌ఎం పీఎస్ సూర్యకుమారి అధ్యక్షతన యువజన సర్వీసుల శాఖ (సెట్రాజ్) ఆధ్వర్యాన విద్యార్థినీ, విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిపుణురాలు ఎ.సత్య శిరీష పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

యోగా అభ్యాసకురాలికి సన్మానం

రావులపాలెం: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ యోగా అభ్యాసకురాలిగా బహుమతి పొందిన స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎ.అంజలీ దేవిని గురువారం సన్మానించారు. కళాశాలలో ప్రిన్సిపాల్ కె.జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఇటీవల అవార్డు పొందిన అంజలీదేవిని శాలువా, పూలమాలలతో అభినందించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ చినబాబు, డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, పీడీ యువరాజు తదితరులు పాల్గొన్నారు.